సాక్షి కాకినాడ

బుధవారం | 15 | నవంబర్ | 2023



రూ.1,16,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అమ్మిజూరి నవీన్‌కుమార్, వైష్ణవి దంపతులు (జీలుగుమిల్లి) మంగళవారం రూ.1,16,116 విరాళం సమర్పించారు.



రూ.25 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు మునుమూరి శేషగిరి రావు, వెంకట రాజేశ్వరి దంపతులు (మడికి) మంగళవారం రూ.25 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు మంగళవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సత్యదేవుని గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు

మీడియాతో ఈఓ చంద్రశేఖర్ అజాద్



విలేకర్ల సమావేశంలో ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈనెల 27న కార్తిక పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కార్తికమాసం సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. ఈసారి సోమవారం పౌర్ణమి రానున్నందున గిరిప్రదక్షిణలో లక్షకు పైగా భక్తులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం ఎనిమిది గంటలకు కొండ దిగువన తొలిపాంచా నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. అక్కడ నుంచి అన్నవరం మెయిన్‌రోడ్ మీదుగా బెండపూడి శివారు పుష్కర కాల్వ రోడ్డు మీదుగా సత్యగిరి, రత్నగిరి చుట్టూ ప్రదక్షిణ చేశాక పంపా ఘాట్ వద్దకు చేరుకుంటుందన్నారు. గిరిప్రదక్షిణ జరిగే మార్గంలో ప్రతీ కిలోమీటర్ వద్ద మంచినీరు, పండ్లు, పులిహోర, మజ్జిగ, పాలు తదితర ఆహార పదార్థాల పంపిణీ కి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని పంపిణీ చేసేందుకు ఆసక్తి కలిగిన దాతలు ఫోన్ నంబర్లలో (90300 59998, 83673 74978, 99519 97666) సంప్రదించాలని ఈఓ విజ్ఞప్తి చేశారు.

దేవదాయ భూముల పరిరక్షణకు చర్యలు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): దేవదాయశాఖకు చెందిన భూములు అన్యాక్రాంతమైతే బాధ్యులైన ఈఓలపై చర్యలు తీసుకుంటామని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు తెలిపారు. కాకినాడలోని దేవదాయశాఖ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా, పశ్చిమగోదావరి జిల్లా ఈవోలతో సమావేశం జరిగింది. గతంలో దేవదాయశాఖ భూములు అన్యాక్రాంతమైతే కాలయాపన చేయకుండా వాటిని తొలగించే అధికారం ఈవోలకు కల్పించారన్నారు. దేవదాయశాఖకు చెందిన ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్, తాసీల్దార్ , సర్వేయర్లు అందుబాటులో ఉన్నారన్నారు. వారి సేవలు వినియోగించుకోవాలన్నారు. భూములు కాపాడుతూ దాతల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్తికమాసంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యాన్నదానం జరిగే ఆలయాల్లో భక్తులందరూ అన్నప్రసాదం తినేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా దేవాదాయశాఖాధికారులు పులి నారాయణమూర్తి, కెఎస్‌వీడి ప్రసాద్, సోమరాజు పాల్గొన్నారు.

కంటిరోగులపై ప్రత్యేక శ్రద్ధ

కాకినాడ సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నమోదైన కంటి సమస్యలకు సకాలంలో శస్త్ర చికిత్స జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జగనన్న వైద్య ఆరోగ్య సురక్ష శిబిరాలు, క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు తదితర అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి సమస్యలున్న వారికి కళ్లజోళ్లు అందిస్తామన్నారు. శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన శిబిరాల్లో 43,582 కంటి ఓపీల నమోదు కాగా 25,339 మందికి కళ్లజోళ్లు, 3,062 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారన్నారు.



ఉభయ తారకంగా..

- విద్యాదీవెన'కు ఉమ్మడి ఖాతా తప్పనిసరి
- విద్యార్థులకు నిధుల జమ తెలిసేలా చర్యలు
- సక్రమంగా ఫీజు చెల్లింపునకు మార్గం సుగమం
- ఎస్సీ, ఆఖరి ఏడాది విద్యార్థులకు మినహాయింపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోంది. తద్వారా పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి మార్గం చూపుతోంది. ఇందులో భాగంగానే జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలతో సాయపడుతోంది. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను మరింత పకడ్బందీగా నిర్వహించాలని తాజాగా ఆదేశించింది. విద్యా దీవెన కింద ఇంతవరకూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోంది. ఖాతాల్లో జమయ్యాక ఆ సొమ్మును వారు కాలేజీ యాజమాన్యాలకు ఫీజుగా అందజేస్తున్నారు. ఇలా ఖాతాల్లో నగదు జమయిన విషయం తల్లిదండ్రులు చెబితే తప్ప కొందరు విద్యార్థులకు తెలియడం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి తెస్తూంటే వారు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థి తో పాటు తల్లి పేరుతో ఉమ్మడి బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఈ నెల 24లోగా ఉమ్మడి బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం కింద ఈ నెల 28న ప్రభుత్వం నిధులు జమ చేయనుంది.

ముందుచూపుతో జాగ్రత్తలు

ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ తదితర కోర్సుల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద కోర్సును బట్టి ప్రభుత్వం రూ.15 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉమ్మడి ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విద్యాదీవెన సొమ్మును ఆధార్ కార్డుల ఆధారంగా ఆన్‌లైన్‌లో నేరుగా జమ చేస్తున్నాయి. ఇప్పటికే ఈ సొమ్ము జమ అయింది. చివరి సంవత్సరం మిగిలి ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారనే ముందుచూపుతో ప్రభుత్వం ఇలా మినహాయించింది. బీసీ, ఇతర వర్గాల విద్యార్థులకు మాత్రం విద్యాదీవెనను రాష్ట్ర ప్రభుత్వమే జమ చేస్తోంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు విడతల సొమ్మును క్రమం తప్పకుండా ఇప్పటికే జమ చేసింది. నెలాఖరులోపు నాలుగో విడత విడుదల చేయనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఎస్సీ విద్యార్థులు మినహా మిగిలిన అన్ని కేటగిరీల్లో 1,13,443 మందికి సుమారు రూ.51 కోట్ల మేర సాయం అందనుంది.



24 లోపు ఉమ్మడి బ్యాంక్ ఖాతాలు తెరవాలి



జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనకు అర్హులైన విద్యార్థులు తల్లితో కలిసి ఈ నెల 24లోపు ఉమ్మడి బ్యాంక్ ఖాతా తెరవాలి. ఎస్సీ విద్యార్థులు, చివరి సంవత్సరం చదివే వారు ఈ ఖాతా తెరవాల్సిన అవసరం లేదు. ఉమ్మడి ఖాతా తెరిచాక ఆ వివరాలను తమ పరిధిలోని సచివాలయాలకు తెలియజేయాలి. ఉమ్మడి బ్యాంకు ఖాతా అకౌంట్ పుస్తకంలోని మొదటి పేజీ కాపీని అందించాలి. నాలుగో విడత విద్యాదీవెన పథకం నగదు విడుదలకు ఈ ప్రక్రియ తప్పనిసరి. సచివాలయ సిబ్బంది ఉమ్మడి బ్యాంక్ ఖాతా వివరాలను నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేస్తారు. ఖాతాలు తెరిచే విషయంలో తల్లిదండ్రులు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, సచివాలయ సిబ్బంది, బ్యాంక్ మేనేజర్లు సహకరించాలి.

– డీవీ రమణమూర్తి, జాయింట్ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ

జిల్లా	మొత్తం విద్యార్థులు	ఖాతాలు తెరవాల్సినవారు
కాకినాడ	44,524	25,350
కోనసీమ	35,255	17,524
తూర్పు	33,664	18,286

నాలుగో విడత విద్యా దీవెన

కాకినాడ జిల్లా	:	రూ. 21 కోట్లు.
కోనసీమ జిల్లా	:	రూ.16 కోట్లు.
తూర్పుగోదావరి	:	రూ.14 కోట్లు

ఇలా ఖాతా తెరవండి

- కుటుంబంలో ఇద్దరు పిల్లలు చదువుతున్నా తల్లి ఒక అకౌంట్ ఓపెన్ చేస్తే సరిపోతుంది.
- ఉమ్మడి ఖాతాలకు ఎటువంటి ఎన్‌పీసీఐ అవసరం లేదు.
- ఖాతా తెరిచేందుకు బ్యాంకులో తల్లి.. విద్యార్థికి చెందిన మూడు పాస్‌పోర్ట్ ఫోటోలు..ఆధార్ కార్డులు.. విద్యార్థి చదువుతున్న కాలేజి ఐడి కార్డ్ నకళ్లు అందజేయాలి
- ఆధార్ కార్డులో విద్యార్థి పుట్టిన తేదీ వివరాలు లేకుంటే జనన ధ్రువీకరణ పత్రం గాని 10వ తరగతి మార్కుల మెమోగాని సమర్పించాలి
- బ్యాంకులో అకౌంట్‌ను జీరోమొత్తంతో ప్రారంభించవచ్చు.ఎలాంటి ప్రారంభ డిపాజిట్ అవసరం ఉండదు. .
- ఉమ్మడి ఖాతా ప్రైమరీ అకౌంట్ హోల్డరుగా విద్యార్థి మాత్రమే ఉంటాడు.
- విద్యార్థి ఇదివరకే ఖాతా కలిగి ఉన్నప్పటికీ కొత్త ఉమ్మడి ఖాతా అవసరం. ఎందుకంటే దీనికి డెబిట్ కార్డ్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ సౌకర్యం ఉండకూడదు.
- తల్లి మరణించిన సందర్భంలో తండ్రి లేదా సంరక్షునితో కలిసి ఖాతా తెరుచుకోవచ్చు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు

తగ్గుముఖం

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్పీ సతీష్ కుమార్

గండేపల్లి: జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు 22 శాతం తగ్గుముఖం పట్టినట్టు ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ గతేడాది నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే రోడ్డుప్రమాదాలు తగ్గాయన్నారు. గండేపల్లి, జగ్గంపేట పరధిలోని హైవేలో 17 శాతం తగ్గినట్టు చెప్పారు. ఈ ఏడాది సకాలంలో రక్షించడం ద్వారా 75 రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం జరగకుండా చూశామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, చోరీల కట్టడికి గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహిస్తున్నామన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడం వల్ల చోరీలు తగ్గుముఖం పట్టినట్టు పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల వివరాల సేకరణ, రౌడీ షీటర్స్, సీజ్ చేసిన వాహనాలు, చోరీలు, ప్రమాదాలు, పాత, కొత్త కేసులు, తదితర అంశాల పరిశీలనకు తాను పోలీస్ స్టేషన్‌ను సందర్శించానన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు, ఎస్సై గణేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు

డీసీసీబి సీఈఓ ఆర్‌వీ నరసింహారావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సహకార సంఘాల ద్వారా రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు అన్నారు. అవసరమైన అన్ని రుణాలు ఇవ్వడంలో సహకార బ్యాంకు ముందుందన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కాకినాడ డీసీసీబీ ఆవరణలో సహకార సప్తవర్ణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర ఉన్న సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసి రైతులకు సేవలు అందిస్తామన్నారు. గతంలో రైతులకు సహకార బ్యాంకులు ద్వారా పంట రుణాలు మాత్రమే అందించే వారమన్నారు. నేడు రైతులకు అవసరమైన ఇంటి రుణాలు, పిల్లలకు అవసరమైన విద్యారుణాలు, బంగారు నగలు తాకట్టుపై తక్కువ వడ్డీకి రుణాలతో పాటు కమర్షియల్ బ్యాంకుకు తీసిపోని విధంగా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నామన్నారు. సహకార రంగ ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేసి సహకార రంగం బలోపేతానికి కృషి చేయాలన్నారు. సహకార వారోత్సవాల ఇన్‌చార్జ్ కృష్ణకాంత్ మాట్లాడుతూ సహకార వారోత్సవాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ పాలకవర్గ సభ్యులు సయ్యద్ మెహిద్దీన్, నాబార్డు డీడీఎం వై సోమినాయుడు , డీసీసీబీ బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సహకారశాఖ కార్యలయంలో సహకార పతాకాన్ని జిల్లా సహకార అధికారి బీకే దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనలో సహకార వ్యవస్థ గణనీయమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి పిబిఎమ్‌ఎమ్ కుమార్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

25న తునిలో సామాజిక, సాధికారక యాత్ర

- జగన్‌తోనే బీసీ.ఎస్సీ.ఎస్టీ. మైనార్టీలకు న్యాయం
- తుని రాజా కళాశాల మైదానంలో బహిరంగ సభ
- సాధికారక యాత్ర పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి రాజా



సామాజిక,సాధికారక యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా రాష్ట్రంలోని బీసీ.ఎస్సీ.ఎస్టీ.మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారని రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో సామాజిక, సాధికారక యాత్ర పోస్టర్‌ను మంత్రి రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, సాధికారక యాత్ర ఈ నెల 25న తునికి చేరుకుంటుందన్నారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభ జరుతుందన్నారు. తుని నియోజకవర్గానికి చెందిన బీసీ.ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఏ వర్గాలకు ఎంత మేర ప్రయోజనం కలిగిందో సభలో నేతలు వివరిస్తారన్నారు. ముఖ్య నాయకులు మండలాల వారీగా సమావేశాలు పెట్టి జన సమీకరణ చేయాలన్నారు. రాష్ట్ర పెరికి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగా భవానీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జి, కోట నందూరు ఎంపీపీ లగుడు శ్రీను, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, కోట నందూరు మండల పార్టీ అధ్యక్షుడు చింతకాయల చినబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, పోతల రమణ, గారా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

కోటనందూరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారం చేపడుతుందని రోడ్లు, భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కోటనందూరు మండలం భీమవరపుకోటలో సర్పంచ్ జిగటాల వీరబాబు అధ్యక్షన జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో మంత్రి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ కోల్పోతోదన్నారు. ప్రస్తుతం ఆ పార్టీకి 20 శాతం మాత్రమే ప్రజామోదం ఉందన్నారు. 80 శాతం ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలుకుతున్నారన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతోనే 'వై నాట్ 175' అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటున్నారన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రం అన్ని విధాలా దగా పడిందన్నారు. టీడీపీలో అత్యున్నత పదవులు అనుభవించిన యనమల రామకృష్ణుడు తుని నియోజక వర్గానికి చేసిందేమి లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా సీఎం జగన్ ముందుకు వెళ్తున్నారన్నారు. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల జాబితాను ఆవిష్కరించారు. రూ. 28 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని మంత్రి పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు.


సత్యదేవా తెప్పోత్సవానికి నీరేదీ ?

- పంపా రిజర్వాయర్లో తగ్గుతున్న నీటిమట్టం
- హంస వాహన విహారానికి 96 అడుగులు అవసరం
- ఏలేరు, పుష్కర నుంచి పెరగాల్సిన నీటి విడుదల
- ముందుగా మేల్కొనకుంటే వేడుకకు ఇబ్బందులు

అన్నవరం: కార్తికమాసం ప్రారంభ నేపథ్యంలో రత్నగిరిపై క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఈ నెల 24న జరుగనున్న సత్యదేవుని తెప్పోత్సవానికి నీటి సమస్య అడ్డంకిగా మారే అవకాశం కనిపిస్తోంది. 103 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల పంపా నదిలో తెప్పోత్సవంలో హంస వాహనం విహరించాలంటే కనీసం 96 అడుగుల నీటిమట్టం ఉండాలి. ప్రస్తుతం 90 అడుగులు మాత్రమే ఉంది. దేవస్థానం అధికారులు పుష్కర, ఏలేరు రిజర్వాయర్ నుంచి రోజుకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయించకపోతే ఇబ్బంది తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాలుగేళ్లగా విస్తారంగా వర్షాలు కురియడంతో నీటి మట్టం వంద అడుగులకు పైగా ఉండేది. ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది.

నెలంతా పుణ్యస్నానాలు

కార్తిక మాసమంతా పంపా సత్రం వెనుక గల పంట కాల్వ ఒడ్డున, పవర్‌హౌస్ వద్ద గల పంపా ఘాట్లలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్నానాలు చేస్తుంటారు. ఇందుకు నెలరోజులూ పంపాలో పూర్తిస్థాయిలో నీరు ఉండాలి. ప్రస్తుతం కొంత ఇబ్బంది గానే ఉంది. ఒకవైపు పుష్కర కాల్వ నుంచి, ఏలేరు రిజర్వాయర్ నుంచి పంపా రిజర్వాయర్‌కు రోజుకు 60 క్యూసెక్కుల నీరు విడుదలతోంది. అంటే రోజుకు పంపా ఆయకట్టుకు 80 క్యూసెక్కులు చేరుతోంది. వచ్చే నీటి కన్నా విడుదలయ్యే నీరు ఎక్కువగా ఉంది. పంపా ఆయకట్టులో ఖరీఫ్ గట్టెక్కాలంటే డిసెంబర్ నెలాఖరు వరకు నీటి విడుదల తప్పనిసరి. అందువలన నీటి విడుదల పెరగాల్సి ఉంది. ఇందుకు ఏలేరు, పుష్కర నుంచి రోజుకు 200 క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవల్సి ఉంది. జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలుంటే తప్ప పుష్కర, ఏలేరు అధికారులు నీటి విడుదల పెంచే అవకాశం లేదు.



90 అడుగుల మేర నీటిమట్టం ఉన్న దృశ్యం

జౌను నీటి విడుదల పెరగాల్సిందే

అన్నవరం దేవస్థానం అధికారులు నీటి సమస్యపై కలెక్టర్‌ను కలిసి పూర్తిస్థాయిలో నీటి విడుదలకు ఆదేశాలు వచ్చేలా చొరవ తీసుకోవల్సి ఉంది. లేని పక్షంలో కార్తికమాసంలో భక్తుల స్నానాలకు, తెప్పోత్సవానికి నీటి సమస్య తప్పదనే అభిప్రాయాన్ని ఇరిగేషన్ అధికారులూ వ్యక్తం చేస్తున్నారు. హంస వాహనంగా అలంకరించే తెప్ప పంపా నదిలో తిరగాలంటే కనీసం 96 అడుగుల నీటి మట్టం ఉండాలి. ప్రస్తుతం 90 అడుగులు ఉంది. రిజర్వాయర్‌లో నీటినిల్వ రోజు రోజుకు తగ్గిపోతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై పంపా రిజర్వాయర్ ఏఈ కే శ్రీదేవి మాట్లాడుతూ రిజర్వాయర్ నీటి మట్టం పెంచేందుకు ఏలేరు నుంచి 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించామన్నారు. తెప్పోత్సవం నాటికి పంపా నీటిమట్టం 96 అడుగులు ఉండాలంటే అటు పుష్కర, ఇటు ఏలేరు నుంచి రోజుకు రెండు వందల క్యూసెక్కుల నీరు విడుదల కావల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు.



నీటి నిల్వలు తగ్గడంతో సగం మేర ఎండిపోయిన పంపా రిజర్వాయర్

క్లుప్తంగా

జాతీయ నెట్‌బాల్ పోటీలకు నాగేంద్ర కుమార్


నాగేంద్ర కుమార్‌తో హెచ్‌ఎం, పీఈటీ

ఆత్రేయపురం: వాడపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఏపుగంటి నాగేంద్ర కుమార్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకట్రావు, పీఈటీ నాగబాబు మంగళవారం ఈ విషయం తెలిపారు. ఇటీవల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో నాగేంద్ర కుమార్ ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. జనవరి మొదటి వారంలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడని చెప్పారు. నాగేంద్ర కుమార్‌ను సర్పంచ్ పోచిరాజు బాబూరావు, గ్రామస్తులు, స్కూల్ కమిటీ చైర్మన్ వై.శ్రీను తదితరులు అభినందించారు.

రూ.800 వ్రతం చార్జీ పెంపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో రూ.800 వ్రతం టికెట్‌ను మంగళవారం నుంచి రూ.వెయ్యికి పెంచారు. దీనిపై ఈ నెల మూడో తేదీన జరిగిన సమావేశంలో ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ధర్మకర్తల మండలి ఆమోదించింది. ఈ నేపథ్యంలో దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ పెంపుదలపై ఆదేశాలిచ్చారు. కాగా, దేవస్థానంలో రూ.300, రూ.1,500, రూ.2 వేల వ్రతాల టికెట్ల ధరలు మాత్రం పెంచలేదని ఈఓ తెలిపారు.

శ్రీపీఠం.. భక్తి కెరటం


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- వైభవంగా మహాశక్తి యాగం ఆరంభం
- కుంకుమార్చనల వేదికపై ప్రతిధ్వనించిన లలితా సహస్రనామ స్మరణ
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు


మహాశక్తి యాగంలో భాగంగా స్వయంగా శతకోటి లలితా కుంకుమార్చన చేయిస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలోని శ్రీపీఠంలో భక్తికెరటం ఎగసిపడింది. ఒకటీ రెండూ కాదు.. ఏకంగా 30 రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక మహా క్రతువుకు అంకురార్పణ జరిగింది. ప్రతి ఒక్కరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఇష్టకార్య సిద్ధి పొందాలనే లక్ష్యంతో సంకల్పించిన మహాశక్తి యాగం.. పవిత్ర కార్తిక మాస ఆరంభం రోజైన మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. యజ్ఞయాగాలు, జపతపాలు, ఇతర వైదిక క్రతువులతో ఈ ప్రాంతంలో ఈ మాసమంతా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుంది. సువాసినులు తమ ఐదోతనం చల్లగా ఉండాలని కుంకుమార్చనలతో అమ్మవారిని వేడుకుంటారు. అటువంటిది ఐశ్వర్యాంబికా సమేత సుందరేశ్వర స్వామి కొలువై ఉన్న శ్రీపీఠంలో.. నెల రోజుల పాటు జరిగే శతకోటి లలితా కుంకుమార్చన, కోటి దీపోత్సవం వంటి పూజా కార్యక్రమాల్లో నేరుగా పాల్గొనే అవకాశం లభిస్తుండటంతో వేలాదిగా మహిళలు తరలివస్తున్నారు. తొలి రోజు కుంకుమార్చనల్లో ఏకంగా 12 వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీపీఠం, గోశాల వద్ద సందడి నెలకొంది. మహిళలు శ్రీపీఠంలో పంపిణీ చేసిన వస్త్రాలు ధరించి భగవంతుడు, అమ్మవార్ల ముందు తామంతా ఒకటే అన్నట్టుగా ఐక్యతను చాటుతూ క్రమశిక్షణతో తరలిచ్చారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మహాశక్తి యాగం, బగళాముఖి అమ్మవారి విశిష్టత, హోమం, 27 నక్షత్రాలకు శాంతి పూజలు, 27 తిథి దేవతలకు పూజలు, కోటి దీపోత్సవం గురించి వివరించారు. కార్తిక మాసమంతా జరిగే ఈ మహాశక్తి యాగాన్ని ఒకే సంకల్పంగా భావించి మహిళలందరూ పాల్గొనాలని కోరారు. లలితా సహస్ర నామాలను స్వామీజీ స్వయంగా చదివి మహిళలతో కుంకుమార్చన చేయించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి బగళాముఖి హోమం, నక్షత్ర పూజలు దీపోత్సవం జరగనున్నాయని స్వామీజీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా శ్రీపీఠం వలంటీర్లు సేవలందించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ, సర్పవరం సీఐ మురళీకృష్ణ, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

వైభవంగా శోభాయాత్ర

బోట్‌క్లబ్: మహాశక్తి యాగారంభాన్ని పురస్కరించుకొని కాకినాడ నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక రిజర్వు లైన్ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి భానుగుడి సెంటర్ నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా జరిగిన ఈ యాత్రలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. కుంభకోణం నుంచి తీసుకుచ్చిన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలతో శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద స్వామీజీ ఆధ్వర్యాన ఈ యాత్ర జరిగింది. ఆద్యంతం కేరళ చెండై వాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, మహిళల కోలాటాల నడుమ యాత్ర సాగింది. హరహర మహాదేవ నామస్మరణతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా భానుగుడి సెంటర్‌లో భక్తులనుద్దేశించి స్వామీజీ మాట్లాడుతూ, ప్రపంచ పటంలో కాకినాడను ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుపుతామని అన్నారు. గతంలో ఎక్కడా చేయలేని మహాశక్తి యాగం నిర్వహించి ప్రపంచానికి చూపిస్తానన్నారు. యాగం పూర్ణాహుతి రోజున శ్రీపీఠంలో చరితాత్మక కట్టడాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

తుని: అన్నవరం రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందాడు. తుని జీఆర్‌పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ కథనం ప్రకారం.. తుని నుంచి సామర్లకోట వైపు వెళుతున్న రైలు నుంచి జారి పడిన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరం నుజ్జునుజ్జయ్యింది. శరీరంపై కాషాయం రంగు చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మారూఫ్ తెలిపారు.

రేపు సామాజిక సాధికార బస్సు యాత్ర

- రావులపాలెం నుంచి భారీ ర్యాలీ
- కొత్తపేటలో బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి


కొత్తపేటలో బహిరంగ సభ ఏర్పాట్లపై పోలీసు అధికారులు, నాయకులతో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన సామాజిక విప్లవం, సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఈ యాత్ర గురువారం కొత్తపేట నియోజకవర్గంలో జరగనుంది. ఈ నేపథ్యంలో కొత్తపేటలో సభాస్థలి, వాహనాల పార్కింగ్, భోజనాలు ఏర్పాటు చేసే స్థలాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కొప్పన శివనాగు, ఇన్‌చార్జి డీఎస్పీ సుంకర మురళీమోహన్, నాయకులతో కలిసి జగ్గిరెడ్డి మంగళవారం పరిశీలించారు. రావులపాలెం నుంచి భారీ ర్యాలీగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని, ఆ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. స్థానిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానం, శ్రీకరి శుభకరి కల్యాణ మండప ప్రాంగణాలను వాహనాల పార్కింగుకు కేటాయించనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భోజనాలకు ఏర్పాట్లు చేస్తారు. ఇక్కడ సుమారు 20 స్టాల్స్ ఏర్పాటు చేయాలని జగ్గిరెడ్డి సూచించారు. ఆ రోజు రావులపాలెం - అమలాపురం మధ్య రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ, ఇతర వాహనాలను పలివెల - రావులపాడు రోడ్డు (బొబ్బర్లంక - అమలాపురం కాలువ గట్టు రోడ్డు) మీదుగా మళ్లించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకూ వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధి, రాజకీయ పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో కల్పించిన సామాజిక న్యాయాన్ని వివరించేందుకు ఈ బస్సు యాత్ర చేపట్టామని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచీ పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో మోటార్ సైకిళ్లపై గురువారం మధ్యాహ్నం రావులపాలెం చేరుకుంటారని, అక్కడి నుంచి బస్సు యాత్రతో పాటు భారీ ర్యాలీగా కొత్తపేట పాత బస్టాండు సెంటర్‌కు చేరుతారని తెలిపారు. ఆ సమీపంలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ యాత్రలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనురాధ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, జిల్లా, ఇతర జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ సామాజికవర్గాల నాయకులు పాల్గొంటారని వివరించారు. సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మునునూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, పార్టీ నియోజకవర్గ నాయకులు ఎంఎస్ఆర్, కర్రి అశోక్‌రెడ్డి, రావులపాలెం సీఐ రజనీకుమార్, ఎస్సై వి.మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.







జాతీయ బాస్కెట్‌బాల్‌కు చరిష్మా సాయిరుత్వి

అంబాజీపేట: జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిమ్మకాయల చరిష్మా సాయిరుత్వి ఎంపికైంది. ఎనిమిదో తరగతి చదువుతున్న ఆమె ఇటీవల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన అండర్-14 బాలబాలికల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి, రాష్ట్ర జట్టులో స్థానం సాధించింది. ఈ సందర్భంగా చరిష్మా సాయిరుత్విని పాఠశాలలో హెచ్‌ఎం కడలి సాయిరామ్ ఆధ్వర్యాన ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ మంగళవారం అభినందించారు. వచ్చే నెల రెండో వారంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో చరిష్మా పాల్గొంటుందని హెచ్‌ఎం సాయిరామ్ చెప్పారు. ఈ ఏడాది పాండిచ్చేరిలో జరిగిన సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు సైతం చరిష్మా ఎంపికైంది. వరుసగా ఈ ఏడాది రెండుసార్లు జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఆమె ఎంపికవడం అభినందనీయమని అన్నారు. అలాగే స్కూల్ గేమ్స్ విభాగంలో ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టుకు సైతం ఎంపికవడం ద్వారా చరిష్మా ఆల్‌రౌండ్ ప్రతిభ చూపిందని తెలిపారు. ఈ సందర్భంగా చరిష్మాను, శిక్షణ ఇచ్చిన పీడీ కుంపట్ల ఆదిలక్ష్మిని ఎంఈఓలు వెంకటేశ్వరరావు, ప్రకాష్, హెచ్‌ఎం సాయిరామ్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్నపు సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, బీఎస్ఎస్ మూర్తి, పీఈటీ ఎ.సూర్యకుమారి పాల్గొన్నారు.


చరిష్మా సాయిరుత్విని అభినందిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో తమిళనాడులోని నమ్మక్కళ్ జిల్లా కేంద్రానికి చెందిన అన్బూ చార్లెస్ దేశవ్యాప్త సైకిల్ యాత్ర చేస్తున్నారు. యాత్రలో భాగంగా ఆయన మంగళవారం మామిడికుదురు చేరుకున్నారు. ఈ యాత్రను 2005 ఏప్రిల్ 22న చేపట్టానన్నారు. ఇంతవరకూ 20 రాష్ట్రాల్లో 47 వేల కిలోమీటర్ల మేర తన యాత్ర సాగిందని చెప్పారు. కోవిడ్ కారణంగా మూడేళ్లు సైకిల్ యాత్రను నిలిపివేశానని, పరిస్థితులు చక్కబడిన తర్వాత తిరిగి ప్రారంభించానని తెలిపారు. ప్రస్తుతం తన వయస్సు 67 ఏళ్లు అని, ఎంఏ (సోషియాలజీ) చదివానని చెప్పారు. తన సైకిల్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, లేకుంటే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని చార్లెస్ అన్నారు. ఒంటరివాడినైన తాను ప్రాణం ఉన్నంత వరకూ సైకిల్ యాత్ర కొనసాగిస్తూనే ఉంటానని చెప్పారు.


దేశవ్యాప్త సైకిల్ యాత్ర చేస్తున్న చార్లెస్

రబీకి సమృద్ధిగా సాగునీరు

- సమర్థ నీటి యాజమాన్య ప్రణాళిక అమలు
- జిల్లా సాగునీటి, వ్యవసాయ సలహా మండళ్ల సమావేశాల్లో మంత్రి వేణు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు. చిత్రంలో ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, కలెక్టర్, జేసీ తదితరులు

కాకినాడ సిటీ: వచ్చే రబీలో జిల్లాలోని 1.91 లక్షల ఎకరాల పూర్తి ఆయకట్టుకు సమర్థ నీటి యాజమాన్య ప్రణాళికతో సాగునీరు అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జిల్లా సాగునీటి సలహా మండలి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు సంయుక్తంగా కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన మంగళవారం ఉదయం జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రబీలో పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఇందుకు అనుగుణంగా ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఇదీ ఇరిగేషన్ శాఖ ప్రణాళిక

జిల్లాలోని వివిధ సాగునీటి వ్యవస్థల కింద రబీ సాగునీటి సరఫరా ప్రణాళికలను ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు తొలుత వివరించారు. గోదావరి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల పరిధిలోని మొత్తం 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు రబీలో 91.35 టీఎంసీల సాగునీరు అవసరం కాగా, 82.49 టీఎంసీల నీటి లభ్యత ఉందని చెప్పారు. వారాబందీ విధానం, క్రాస్‌బండ్లు, డీజిల్ ఇంజిన్లతో నీరు ఎత్తిపోయడం, ముందస్తు వరి నాట్ల ద్వారా మిగిలిన 10 శాతం కొరతను అధిగమించి, మొత్తం ఆయకట్టుకు నీరందించేందుకు ప్రతిపాదిస్తున్నామని అన్నారు. జిల్లాలో తూర్పు డెల్టా పరిధిలోని 1.06 లక్షల ఎకరాలు, పిఠాపురం బ్రాంచి కెనాల్ (పీబీసీ) పరిధిలోని 32,500 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. పీబీసీ పరిధిలో 22,260 ఎకరాల్లో వరి, 10,240 ఎకరాల మెట్ట, శివారు ఆయకట్టులో అపరాల సాగుకు ప్రతిపాదించామన్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 11.31 టీఎంసీల నీటి నిల్వలున్నాయని, ఇందులో విశాఖ నగరం, స్టీల్‌ప్లాంట్ అవసరాలకు 4.50 టీఎంసీలు, మరో 4.5 టీఎంసీలు డెడ్ స్టోరేజీకి కేటాయించామన్నారు. 53 వేల ఎకరాల ఏలేరు ఆయకట్టులో రబీ పంటలకు మరో 2.31 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని ఎస్ఈ శ్రీనివాసరావు వివరించారు. ఇందులో 28 వేల ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో అపరాల పంటలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదించామన్నారు.

- గోదావరి డెల్టాలో రబీ పంటలకు సాగునీటి ఎద్దడి లేకుండా నివారించేందుకు, పోలవరం బ్యారేజీ గేట్లు దింపి, కనీసం 20 టీఎంసీల నీటిని నిల్వ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన ప్రతిపాదనను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.
- ఏలేరులో డెడ్ స్టోరేజీ స్థాయిని 4.5 టీఎంసీలకు బదులు 2 టీఎంసీలకు తగ్గించి, వీలైనంత మేర మెట్ట, శివారు ఆయకట్టులో అపరాలకు బదులు వరి సాగుకు అవకాశం కల్పించాలని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, రైతు ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రతిపాదనలను సవరించాల్సిందిగా ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావును సమావేశం కోరింది.

రైతులకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటితో రబీ సాగును సజావుగా, సకాలంలో 2024 మార్చి 31లోగా పూర్తి చేసేందుకు వీలుగా రైతులు వచ్చే నెలాఖరులోగా నాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ ఆలస్యమైన రైతులు పంట కాలం కలిసి వచ్చేందుకు వచ్చే నెల 10 లోగా వెదజల్లే పద్ధతిలో నాట్లు వేసుకోవాలని, దీనిపై రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) స్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జనవరి చివరి వారం నుంచి వారాబందీ విధానం అమలు చేయాలని, ఏ భూములకు ఎప్పుడు నీరిచ్చేది షెడ్యూల్ రూపొందించి రైతులందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. రబీ సాగునీటి సరఫరా ప్రారంభానికి ముందే ఆక్వా అవసరాలకు నీటిని నింపుకొనే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ముందస్తు సాగు అవసరం, నీటి సరఫరా నియంత్రణ, షెడ్యూల్ తదితర అంశాలపై అన్ని స్థాయిల్లో వ్యవసాయ సలహా మండళ్లు, అభ్యుదయ రైతులు, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. నీరు పారని మెట్ట ప్రాంత రైతులు, నాట్లు సకాలంలో వేసుకోలేని వారు అపరాలు సాగు చేసేలా సూచించాలన్నారు.

రూ.1.45 కోట్లతో 25 పనులు

రబీ సాగునీటి విడుదలకు ముందే నీటి పారుదల సమస్యల నివారణకు తూర్పు డెల్టా పరిధిలో రూ.45.97 లక్షలతో 4, కాకినాడ డ్రైనేజీ డివిజన్ పరిధిలో రూ.41.12 లక్షలతో 12, ఏలేరు డివిజన్ పరిధిలో రూ.48.02 లక్షలతో 9 కలిపి మొత్తం రూ.1.45 కోట్ల డీఎంఎఫ్ నిధులతో 25 పనులు మంజూరు చేశామని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేసి, గత సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రూ.5 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిలో రైతు సంఘాలే నిర్వహించుకునేందుకు మండలి ఆమోదం తెలిపింది. రబీలో సమర్థ సాగునీటి సరఫరాకు 42 ఆయిల్ ఇంజిన్లు, 30 క్రాస్‌బండ్లు, 8 షట్టర్లు, స్లూయిస్‌ల ఏర్పాటు, 31 డీసిల్టింగ్, వీడ్ రిమూవల్ పనులు, ఒక ఐడీసీ పని ప్రతిపాదించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, సలహా మండలి అధ్యక్షుడు లంక ప్రసాద్, రాష్ట్ర సలహా మండలి సభ్యులు త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 తాటాకు ఇళ్లు దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న తాటాకిళ్లు

కొత్తపల్లి: నాగులాపల్లి శివారు ఉప్పరగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు తాటాకిళ్లు దగ్ధమై, రూ.14 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. ఈ ఇళ్లల్లో గంధం వెంకట రమణ, గంధం చెల్లారావు, గుర్రాల శాంతమ్మ, కుమిలి ముసలయ్య, కుమిలి సారయ్య, కుమిలి దుర్గమ్మ, పాకలపాటి శ్రీను కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆ ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలపై మంగళవారం కొబ్బరి ఆకు పడటంతో నిప్పురవ్వలు రేగి, ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నికి వేగంగా వీస్తున్న గాలి తోడవడంతో చూస్తుండగానే మంటలు ఒక ఇంటి నుంచి మరో ఇంటికి వ్యాపించాయి. ఆ వేడికి ఆ ఇళ్లల్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు పేలిపోవడంతో మంటలు మరింత చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇళ్లు, వాటిల్లోని వస్తువులు, నగదు అగ్నికి ఆహుతైపోయాయి. ఇళ్ల నిర్మించుకునేందుకు ముసలయ్య రూ.2 లక్షలు, సారయ్య రూ.1.5 లక్షలు, వెంకట రమణ రూ.3.10 లక్షలు, గుర్రాల శాంతమ్మ రూ.లక్ష చొప్పున దాచుకున్నారు. ఆ నగదంతా కాలి బూడిదైపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. గృహోపకరణాలకు సుమారు రూ.7 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. బాధితులను నాగులాపల్లి ఉప సర్పంచ్ గుర్రాల చిరంజీవి కుమార్ పరామర్శించారు. ప్రమాద విషయాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకువెళ్లి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.